క్లుప్తంగా

చిత్రలేఖన పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని హెలెన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాలలో మంగళవారం బధిర విద్యార్థులకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మహ్మద్, చరిత, చందు, యాస్మిన్, చంద్రశేఖర్, షరీఫ్, జగదీష్ కుమార్, శరత్ ప్రతిభచాటారు. వీరికి కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్ బహుమతులను అందచేసి అభినందించారు.

వసతి గృహాల తనిఖీ



వసతి గృహంలో భోజనం చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అధికారులు వసతి గృహాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ఆహారశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహ విద్యార్థుల అవసరాలను ఆరాతీశారు. ఆహార పదార్థాల నాణ్యత, వసతి గృహాల్లో ఎదురవుతున్న అసౌకర్యాల గురించి తెలుసుకొని అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

డీఈఓకు వినతి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర విద్యాశాఖ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఇచ్చిన ఎస్ఎస్‌సి యాక్షన్ ప్లాన్‌ను సవరించాలని ఎస్టీయూ కడప జిల్లా శాఖ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం బాలగంగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మీనాక్షిని కలిసి ఎస్టీయూ కడప జిల్లా శాఖ తరపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్‌సి వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో సాధారణ పనిదినాల్లో కాకుండా ప్రభుత్వ సెలవులలో కూడా పనిచేయాలని ఆదేశించడం బాగాలేదన్నారు. సెలవు దినాలలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం లేని కారణంగా పిల్లలు ఇబ్బందులకు గురి అవుతారని అన్నారు. సెలవు దినాల్లో పిల్లల హాజరు కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, జబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



నూతన సభ్యులతో యూనియన్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జీ–445 బలమైన శక్తిగా ఎదుగుతోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సమక్షంలో 70 మంది యూనియన్ సభ్యత్వం తీసుకున్నారు. వారికి కండువాలు వేసి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీ నాయకులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా కంపా జయప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎ.లక్షుమయ్య, జిల్లా అధ్యక్షునిగా ఎస్.దేవేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా మునిరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యల్లమ్మనాయుడు, ఉపాధ్యక్షులుగా ఉత్తయ్య, జాయింట్ సెక్రటరీగా జి.సరిత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అయోధ్య రామయ్య, రీజినల్ ట్రెజరర్‌గా అరుణ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్‌కు నివాళి



ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో భారతీయ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. హాకీ శిక్షకుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన స్మారకార్థం ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్రమంలో హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నదాత నెత్తిన బీమా భారం

- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు అవస్థలు
- లబోదిబోమంటున్న కర్షకులు



కడప అగ్రికల్చర్ : మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాతలకు సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ. 20 వేలు రైతుల ఖాతాలకు జమ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించింది. పైగా అదనంగా పంటల బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఇందుకు సంబంధించిన గడువును డిసెంబర్ 15వ తేదీ వరకు ప్రకటించింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల తరఫున ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి అన్నదాతలను ఆదుకుంది. దీంతోపాటు పంట సాగు చేసే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ. 13,500 మొత్తాన్ని రైతు ఖాతాలకు క్రమం తప్పకుండా జమ చేస్తూ వచ్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తరువాత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా నేటికీ అన్నదాత సుఖీభవ పథకం ఊసేలేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కడప మండలంలో..

కడప మండలంలో 850 మందికి పైగా రైతులు ఉంటే వీరికి 2090 ఎకరాల్లో సాగు భూమి ఉంది. వీరందరికి గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధులను రైతు ఖాతాలకు జమచేస్తుందని ఆశించిన అన్నదాతల ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. కనీసం రబీ సీజన్‌కన్నా పథకాన్ని అమలు చేస్తారనుకుంటే అదీ లేకుండా పోయింది. దీంతో ఖరీఫ్, రబీ పంటల సాగుకు అన్నదాతలు అప్పులు తెచ్చుకోవాల్సి వచ్చిందని పలువురు ఆవేదనను వ్యక్తం చేశారు.

అన్నదాతల ఆవేదన..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఎలాంటి పంటల బీమాను ప్రవేశపెట్టలేదు. దీంతో సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలకు కడప మండలంలో 70 ఎకరాలకుపైగా వరిపంట దెబ్బతినింది. దీంతో దాదాపు 25 మందికిపైగా రైతులకు నష్టం జరిగింది. అప్పటికి పంటల బీమా ప్రవేశ పెట్టకపోవడంతో దెబ్బతిన్న పంటలకు ఒక్క రూపాయి కూడా పంటనష్ట పరిహారం రాలేదని రైతులు వాపోతున్నారు. అయితే రబీ సీజన్ నుంచి రైతులే ప్రీమియంను చెల్లించాలని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. అప్పటికే వర్షాలకు పంటలు దెబ్బతిని అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఇది మరింత భారంగా మారిందని వేదన వ్యక్తం చేస్తున్నారు. చాలామంది రైతులు పంటల బీమా చెల్లింపుపై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై అన్నదాతలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

పంటల బీమాకు సంబంధించి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు..

పంట	చెల్లించాల్సిన ప్రీమియం (ఎకరాకు)
బుడ్డశనగ	రూ.480
మినుము	రూ. 285
పెసర	రూ. 270
నువ్వులు	రూ.180
వేరుశనగ	రూ. 480
జొన్న	రూ.315
పొద్దు తిరుగుడు	రూ. 300
వరి	రూ. 630

ప్రభుత్వమే చెల్లించాలి..



రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియంను గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వమే చెల్లించాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలి.

– అమర్‌నాథరెడ్డి, రైతు, ఆలంఖాన్‌పల్లి

అవగాహన ఏదీ..



రైతులు వ్యవసాయ పనుల్లో పడి పంటల బీమాను సకాలంలో చెల్లించలేరు. ఆ సమయంలో రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పంటల బీమా చెల్లింపునకు సంబంధించి అధికారులు, వ్యవసాయ సిబ్బంది పంటల బీమా చెల్లింపుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి.

– ఈశ్వరరెడ్డి, రైతు, పాత కడప

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలి..



ప్రభుత్వం రైతుల కోసం ప్రకటించిన అన్నదాత సుఖీభవ నిధులను రైతు ఖాతాలకు జమ చేయాలి. చాలా మంది రైతులు ఈ నిధులు వస్తాయని సాగు పెట్టుబడి కోసం అప్పులు చేసుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్నదాత సుఖీభవ నిధులను జమ చేయాలి.

– మల్లికార్జునరెడ్డి, రైతు, గోటూరు

ఎయిడెడ్ పోస్టుల భర్తీలో యువతకు అన్యాయం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడపలోని సెయింట్ జోసఫ్ ఎయిడెడ్ బాయ్స్ హైస్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో నిబంధనలకు విరుద్ధంగా జిల్లా యువతకు అన్యాయం జరిగే విధంగా పోస్టుల భర్తీ జరిగిందని జిల్లా విద్యా శాఖ అధికారులు తగు విచారణ జరిపి సమీక్షించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ బాలుర స్కూల్‌లో బీసీ–ఏ కు సంబంధించిన మ్యాథ్స్ పోస్టుకు భర్తీలో గోల్‌మాల్ జరిగిందని అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తుంటే జిల్లా వారికి కాకుండా తిరుపతికి చెందిన వ్యక్తులతో పోస్టులు భర్తీ చేయడంలో ఆంతర్యం ఏమిటన్నారు. సమావేశంలో నగరకన్వీనర్ విజయ్, నిత్య పాల్గొన్నారు.

9న విద్యార్థులకు పోటీలు

కడప కల్చరల్ : నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఈనెల 9వ తేదీన విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహిస్తున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. తెలుగు భాషోద్ధారకులు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 141వ జయంతి ముందస్తు కార్యక్రమంగా 9వ తేదీ ఉదయం 10 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు పద్యపఠన పోటీలు (ఏవైనా 5 వేమన పద్యాలు), 9,10 తరగతుల విద్యార్థులకు 'బ్రౌన్ జీవితం – సాహిత్యం' అనే అంశంపై వ్యాస రచన, 9, 10 తరగతుల విద్యార్థులకు 'కడపతో బ్రౌన్ అనుబంధం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ శంకర్‌నాయక్

కడప అగ్రికల్చర్ : రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పని సరిగా పంటల బీమా చేయించుకోవాలని కడప డివిజన్ ఏడీఏ శంకర్‌నాయక్ సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పాత కడపలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులందరూ డిసెంబర్ 15వ తేదీలోపు పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. ఇందులో వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, మినుము, శనగ పంటలకు తప్పకుండా బీమా చేయించుకోవాలని తెలిపారు. ఈ పంటల బీమాను మీ సేవా కేంద్రం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పంటల బీమా చేసుకున్న రైతులకు పంట నష్టం జరిగితే బీమా కంపెనీ నష్ట పరిహారం చెల్లిస్తుందన్నారు. తుపాన్ వలన దెబ్బతిన్న పంటలకు సంబంధించి గ్రామ వ్యవసాయ సహాయకులతో ప్రాథమిక సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏడీ పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కార్యాలయ ఏఓ సంజీవరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి మెహరాజ్, పావని, రైతులు పాల్గొన్నారు.

వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న రిమ్స్ వైద్యురాలు డాక్టర్ వనజ

ఏఎఫ్‌యూ : వివక్ష లేని సమాజం కోసం అందరూ కలిసి కృషి చేయాలని కడప రిమ్స్ వైద్యురాలు డాక్టర్ వనజ సూచించారు. మంగళవారం కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో 'స్టాప్ వయలెన్స్ అగెనెస్ట్ ఉమెన్' అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వనజ ముఖ్యవక్తగా విచ్చేసి మాట్లాడుతూ హింసను ఎదుర్కోవాలంటే మహిళలు పోరాడాల్సిందేనన్నారు. పురుషులతో సమానంగా మహిళలకు అన్ని హక్కులు ఉన్నాయన్నారు. ఆ హక్కులను సాధించుకోవాలంటే చట్టాలు తెలుసుకోవాలన్నారు. విశ్వ విద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎన్. రాజేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణకు రాజ్యాంగం ధృడమైన చట్టాలను రూపొందించిందన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆర్తీహోం కార్యదర్శి దుర్గాకుమారి, ఆర్తీ హోం ప్రతినిధులు తేజ, విక్రమ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. వరలక్ష్మి, ఉదయప్రకాష్‌రెడ్డి, డా. ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండాలి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : నగరంలో రహదారుల నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని నగర పాలకసంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఓం శాంతినగర్ రోడ్డు నెం.19, 7లలో పర్యటించి పనుల నాణ్యత పరిశీలించారు. క్లాప్ వాహనాలలో ఇంటింటి చెత్త స్వీకరణ సక్రమంగా కొనసాగేలా చూడాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. గాంధీ ప్లాజా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని హార్టికల్చర్ అధికారులను కోరారు. ప్రజల కోసం పార్కును అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్లాజాలో ఉన్న ఎయిర్ ప్యూరిఫైయర్ పనితీరును పరిశీలించారు. అక్కడే నిర్మాణంలో ఉన్న రోడ్డు, డ్రైయిన్ నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ధనలక్ష్మి, నారాయణస్వామి, డీఈ వేణుగోపాల్, రాజేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక క్వారీతో ఇబ్బందులు పడుతున్నాం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మొలకవారిపల్లె గ్రామస్తులు

కమలాపురం : ఇసుక క్వారీ ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మండలంలోని మొలకవారిపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం మండల తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గంగవరం పంచాయతీ విభరాపురం గ్రామంలో ప్రభుత్వం ఇసుక క్వారీ మంజూరు చేస్తే సంబటూరు పంచాయతీ మొలకవారిపల్లెలో ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. జేసీబీ, హిటాచీలతో టిప్పర్లకు లోడింగ్ చేస్తున్నారన్నారు. గ్రామానికి అత్యంత సమీపంలో ఇప్పటికే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, కనీసం 500–600 మీటర్ల దూరం ఉన్న ఇసుకను తరలించుకోవాలన్నారు. తాగు, సాగు నీటి బోర్లు ఉన్నాయని, ఇసుక తరలించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్వారీని తమ గ్రామం వద్ద లేకుండా ఇతర ప్రాంతాలకు మార్చాలని వారు కోరుతున్నారు.

ముగిసిన జిందేషా మదార్షా వలి ఉరుసు



ఉరుసు సందర్భంగా ఖవ్వాలి పోటీలలో రాబియా చిష్టి, మజమ్మిల్ దరాజీలు

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ హజరత్ సయ్యద్ ఖ్వాజాదర్ బార్ జిందేషా మదార్షా వలి ఉరుసు మహోత్సవం మంగళవారం నాటితో ముగిశాయి. గత రెండు రోజులుగా దర్గా కమిటీ సభ్యులు నిర్వహించారు. గంధం రోజు జెండా మెరవణి జర్గా ఉరుసు రోజునైన సోమవారం రాత్రి ఖవ్వాళి పోటీలను నిర్వహించారు. ఎడాదికి ఒక సారి జరిగే ఉరుసు ఉత్సాహల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఉల్లాసంగా చిన్న పిల్లలను తీసుకుని వెళ్లి ఆనందంగా గడిపారు. ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

9న ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 9న సాగు భూమికి అర్హులైన పేదలతో జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లోని సాగుభూమికి అర్హులైన పేదలతో ధర్నా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరచి అర్హులైన పేదలకు అన్యాయం చేస్తోందన్నారు. అధికారులు ప్రతి మండలంలో అర్హులైన పేదల జాబితా సిద్ధం చేయాలని, ఆ జాబితాలను అసైన్డ్ కమిటీకి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. అలా లేని పక్షంలో పెద్ద ఎత్తున త్వరలో కడప కలెక్టరేట్ ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు.

నేడు నిరసన ప్రదర్శన

కడప కోటిరెడ్డిసర్కిల్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలు, ఇటీవల ఇస్కాన్ టెంపుల్ స్వామీజీ చిన్మయి కృష్ణదాస్ అరెస్టు నేపథ్యంలో దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా బుధవారం సాయంత్రం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఏడు రోడ్ల సర్కిల్ వరకు నిరసన ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అల్పాహారం పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరానికి చెందిన అక్కిరాజు ఈశ్వర్ కార్తీక్ జన్మదిన సందర్భంగా పేదలకు మంగళవారం అల్పాహారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తోడ్పాటుతో పేదలకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : సిద్దవటం మండలంలో వీఆర్ఏగా పనిచేస్తున్న కిషోర్‌పై దాడి చేసి గాయపరిచిన నిమ్మకాయల ఓబుల్ రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఏపీ గ్రామ సేవకుల సహాయ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటపతి, నాగేంద్ర, ట్రెజరర్ అశోక్‌కుమార్‌లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. చిన్నస్థాయి ఉద్యోగి అయిన వీఆర్‌ఏపై దాడి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ ఆకస్మికంగా తనిఖీచేసి పలురికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ అనురాధతో మాట్లాడుతూ ప్రజల వినతులు, విద్యార్థుల సర్టిఫికెట్‌లు, భూసమస్యలు ఎమైనా పెండింగ్ ఉంటే వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు.

జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులు సాధించండి

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంట పొలాల్లో జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నచెప్పలి, బయనపల్లె, రాజుపాళెం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. ప్రతి రైతు ఇ–క్రాప్ బుకింగ్‌తో పాటు ఇ–కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుప్రియ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోని, గంగాదేవి, రోజా, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కమలాపురం : రబీలో సాగు చేసిన పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని దాదిరెడ్డిపల్లె, చిన్నచెప్పలిలో సాగులో ఉన్న మినుము శనగ పంటలను పరిశీలించారు. మినుము పంటలో మరుకా మచ్చల పురుగు ఉందని, దీనిని పూత పురుగు, లేక గూడు పురుగు అని కూడా అంటారని తెలిపారు. అలాగే తెల్లదోమ అధికంగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణాశాఖ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వారు స్థానిక గ్యారేజీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కండక్టర్ల ఫిక్స్‌డ్ చార్జును వెంటనే వేయాలని, టిమ్ మిషన్ల ఛార్జింగ్‌కు ప్రతి బస్సులో ఛార్జింగ్ పాయింట్ పెట్టాలని, 281 చార్జు దగ్గర సీనియారిటీ ప్రకారం డ్యూటీలు వేయాలని, తిరుపతి లింక్ సర్వీసు చేసి రాత్రికి బీహెచ్ఈఎల్ డ్యూటీ చేసిన వారికి మూడురోజులు మస్టర్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో ప్రెసిడెంట్ రాము, ట్రెజరర్ శ్రీనివాసులురెడ్డి, డిపో సెక్రటరీ బాల వెంకటేశుతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రదీప్ రెడ్డి, సుబ్బమ్మ

కడప ఎడ్యుకేషన్ : ఈనెల 15, 16,17 వ తేదీలలో పాట్నాలో నిర్వహించనున్న అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ పదవ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఒంటెద్దు ప్రదీప్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సుబ్బమ్మ పిలుపునిచ్చారు. జాతీయ మహా సభలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం కడప కాగితాల పెంటలోని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వం వారి సంక్షేమాన్ని పక్కన పెట్టేయడం సిగ్గుచేటని వారు దుయ్యబట్టారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునే కార్యచరణ రూపొందించకపోతే దేశంలో రైతు ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయవర్ధన్, సగిలి రాజేంద్రప్రసాద్, చరణ్, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరేన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేన్ రామాంజులరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం కడప నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, షఫీ, మూలె సరస్వతి, సీహెచ్ వినోద్‌కుమార్, బీహెచ్ ఇలియాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

• దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు